# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 367 | సంపుటి : 2 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 25-2-2025 | వెల : .రూ. 5.00



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.


# ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల




- మార్చి 3న నోటిఫికేషన్, 20న ఎన్నికలు
- మార్చి 10 నుండి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం
- మార్చి 20న పోలింగ్, ఓట్ల లెక్కింపు

హైదరాబాద్,(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. తెలంగాణలో ఐదుగురి ఎమ్మెల్సీల పదవీకాలం ముగియనుంది. మార్చి 29 నాటికి ఐదుగురి ఎమ్మెల్సీల పదవీకాలం -మిగతా 2 లో



## మానసిక క్షోభలో రాష్ట్ర ఉద్యోగులు

- రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించలేని దుస్థితి
- ఫీజు రియంబర్స్‌మెంట్‌లో పూర్తి వివక్ష
- 14నెలల మీ పాలనలో ఏ వర్గం సంతృప్తిగా లేదు
- ఇదంతా వదిలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు ఎలా అడుగుతారు
- సీఎం రేవంత్ రెడ్డికీ లేఖ రాసిని కీషన్ రెడ్డి

హైదరాబాద్,(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించకుండా ఉద్యోగులను మానసిక క్షోభకు గురిచేయడం ఎంతవరకు న్యాయమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణలో 14 నెలల -మిగతా 2 లో



## భారత్ మాటలే కాదు.. చేతల్లో చూపిస్తున్నాం

- వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న దేశం
- బ్యాంక్ వ్యాఖ్యలను గుర్తు చేసిన ప్రధాని
- గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో ప్రధాని మోడీ

భోపాల్
భారత్ మాటలకే పరిమితం కావడం లేదని, చేతల్లోను చూపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. భారత్ ఆర్థికరంగంలో వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా కొనసాగు తోందని ప్రపంచ బ్యాంకు చెప్పిందని గుర్తుచేశారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరుగుతోన్న గ్లోబల్ -మిగతా 2 లో



## ఎస్సీ వర్గీకరణలో చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం

### కేసీఆర్ అప్పులకుప్ప చేసి వెళ్లారు

- తెలంగాణ పనుల్లో మోకాలడ్డుతున్న బీజేపీ
- కేసీఆర్ అరెస్ట్ కాకుండా అడ్డుకుంటున్నారు
- ఎమ్మెల్సీ ప్రచారంలో సీఎం రేవంత్ విమర్శలు

కరీంనగర్,
ఎస్సీ వర్గీకరణ అంశంలో చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా -మిగతా 2 లో




## ఇరు రాష్ట్రాలు తేల్చుకోండి

- ఇరురాష్ట్రాల సీఈలు నిర్ణయానికి రావాలి
- నీటి పంపకాలపై కేఆర్ఎంబీ వెల్లడి
- కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ప్రత్యేక సమావేశం

హైదరాబాద్,
కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ప్రత్యేక, అత్యవసర సమావేశం జరిగింది. ప్రస్తుత నీటి సంవత్సరంలో మిగిలిన కాలానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు నీటి వాటాలపై చర్చించేందుకు ప్రత్యేక సమావేశాన్ని -మిగతా 2 లో



## చేసిన అభివృద్ధిని విస్మరించి విమర్శలా..?

- కేసీఆర్‌పై బురదజల్లడమే కాంగ్రెస్ పనా
- తెలంగాణ విముక్తి తరహాలో కాంగ్రెస్ విముక్తి
- కేసీఆర్ ఎత్తిన పిడికిలితోనే ఇది సాధ్యం
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత వెల్లడి

నిజామాబాద్,(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
తెలంగాణకు విముక్తి దక్కినట్లే కాంగ్రెస్ పాలన నుంచి ముక్తి కలగాల్సి ఉందని బిఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కవిత అభిప్రాయపడ్డారు. కేవలం ఏడాది -మిగతా 2 లో



## ఇందిరమ్మ రాజ్యంలో ప్రాణాలకు విలువ లేదు

- ఒక పక్క ప్రమాదం జరిగితే... ఎన్నికల ప్రచారానికి సీఎం రేవంత్ : కేటీఆర్

హైదరాబాద్,
ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలు, కూలీల ప్రాణాలకు విలువ లేదని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. రోమ్ తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టు.. ఎనిమిది మందిని బలిపీఠం ఎక్కించి, గ్రాడ్యుయేట్స్‌కు గాలం వేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారని కేటీఆర్ విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ -మిగతా 2 లో

## బయటకు తెచ్చేందుకు 9 టీమ్స్ రంగంలోకి

- 8 మందిని గుర్తించే ప్రక్రియ వేగవంతం
- ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ తో పాటు నేవీ, ఆర్మీ రంగంలోకి
- 'ఆక్వా ఐ' పరికరాన్ని పంపించిన నేవీ
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- నాలుగైదు అడుగుల మేర బురద, నీరు చేరిక
- పరిస్థితిపై సీఎం రేవంత్ ఆరా

నాగర్ కర్నూలు,
శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం లోపల చిక్కుకున్న 8 మందిని గుర్తించే ప్రక్రియ వేగవంతం చేశారు. లోపల చిక్కుకున్న వారిని గుర్తించేందుకు నేవీ టీమ్ "ఆక్వా ఐ" పరికరాన్ని టన్నెల్ లోపలికి పంపించింది. గత మూడు రోజులుగా -మిగతా 2 లో




## పీఎం కిసాన్ నిధులు విడుదల చేసిన మోడీ



హైదరాబాద్
రైతులకు పెట్టుబడి సాయం కింద కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం-కిసాన్ నిధులు సోమవారం జమ అయ్యాయి. పీఎం కిసాన్ యోజన కింద 19వ విడత నిధులను నిన్న ప్రధాన -మిగతా 2 లో

### తెలుగు పంచాంగం 245/2025,మంగళవారం



సమయ సమాచారం:
సూర్యోదయం: ఉదయం 6:39
సూర్యాస్తమయం: సాయంత్రం 6:17
తిథి:
కృష్ణ పక్ష ద్వాదశి
ప్రారంభం: ఫిబ్రవరి 24 మధ్యాహ్నం 2:26
ముగింపు: ఫిబ్రవరి 25 మధ్యాహ్నం 3:24
కృష్ణ పక్ష త్రయోదశి
ప్రారంభం: ఫిబ్రవరి 25 మధ్యాహ్నం 3:24
ముగింపు: ఫిబ్రవరి 26 మధ్యాహ్నం 4:50
నక్షత్రం:
ఉత్తరాషాఢ
ప్రారంభం: ఫిబ్రవరి 24 రాత్రి 8:09
ముగింపు: ఫిబ్రవరి 25 రాత్రి 10:01
శ్రవణం
ప్రారంభం: ఫిబ్రవరి 25 రాత్రి 10:01
ముగింపు: ఫిబ్రవరి 26 రాత్రి 11:59
అశుభ సమయాలు:
రాహుకాలం: మధ్యాహ్నం 3:24 నుండి 4:51 వరకు
యమగండం: ఉదయం 9:25 నుండి 10:52 వరకు
దుర్ముహూర్తం: మధ్యాహ్నం 2:04 నుండి 2:51 వరకు
వర్జ్యం: మధ్యాహ్నం 3:23 నుండి 5:04 వరకు

## జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం రాయితీ కోసం కలెక్టర్ కి జర్నలిస్టుల వినతి



**రంగారెడ్డి, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రంగారెడ్డి జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలో 50 శాతం రాయితీ కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. కలెక్టర్ వెంటనే స్పందించి, రంగారెడ్డి జిల్లా డీఈఓ సుశిందర్ రావును ఆదేశిస్తూ, ప్రతి ప్రైవేట్ పాఠశాలలో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం రాయితీ ఇవ్వాలనే చర్యలు తీసుకోవాలని సూచించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు మిద్దెల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎం. సైదులు, జిల్లా కమిటీ సభ్యులు మల్లేష్, నరేష్, ఆంజనేయులు, నరసింహా రెడ్డి, భరత్, మధు, సురేష్ తదితరులు ఉన్నారు.

## శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమం



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్ మున్సిపాలిటీ పరిధి డి. పోచంపల్లి గ్రామంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లన్న జాతరలో కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేష్ యాదవ్, శ్రీశైలం యాదవ్, సందీప్ గౌడ్, మల్లారెడ్డి, నాగరాజు, వినయ్ యాదవ్, శివ తదితరులు పాల్గొన్నారు.

## దర్గా సందల్ ఉత్సవంలో పాల్గొన్న బిజెపి నాయకులు రావుల శేషగిరి



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని బేకరీ గడ్డలో దర్గా సందల్ ఉత్సవంలో గాజులరామారం కార్పొరేటర్ బిజెపి నాయకులు రావుల శేషగిరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పర్వేజ్, అఫ్జల్, ఫరీద్, యాసిన్, గఫర్ మరియు దర్గా కమిటీ సభ్యులు కూడా పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన బిజెపి నేతలు

## - మౌలిక వసతుల లోపంపై ఆగ్రహం







**బడంగ్ పెట్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

బడంగ్ పెట్ మున్సిపల్ కార్పొరేషన్-1 బిజెపి అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి ఈరోజు కార్పొరేషన్‌లోని బడంగ్ పెట్ మరియు బాలాపూర్ ప్రభుత్వ పాఠశాలలను బిజెపి నేతలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, "దేశ భవిష్యత్తు పాఠశాలలో నిర్మాణం అవుతుంది" అని మన పెద్దలు చెప్తుంటారని చెప్పారు. మంచి విద్యను అందిస్తే, భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని, దేశ భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తారని చెప్పారు. కానీ ఇక్కడ ప్రభుత్వ పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు లేక, విద్యార్థులు చదవడానికి భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. సరైన బాత్రూం వసతులు లేక, విద్యార్థులు బడికి వెళ్లడానికి భయపడుతున్నారని, ఈ దుర్భర పరిస్థితిని మాజీ మేయర్ సొంత ఊర్లో ఉన్న పాఠశాల పరిస్థితి అంతే దారుణంగా ఉందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే టీచర్ల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, హెడ్మాస్టర్ కూడా తన ఆవేదనను వ్యక్తం చేశారని అన్నారు. వెంటనే బాలాపూర్ ప్రభుత్వ పాఠశాల సమస్యలను ప్రభుత్వం పట్టించుకుని, ఆ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నడికుడ యాదగిరి, మాజీ కార్పొరేటర్ గౌర రమాదేవి శ్రీనివాస్, రేసు నరసింహారెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నవారు శ్రీనివాస్ రెడ్డి, కొంతం ప్రకాష్ రెడ్డి, రావుల మల్లేష్, జగదీశ్వర్ రాజు, మోర మహేందర్, లాలా సందీప్, కుంటి భాస్కర్, క్యారగారి అరవింద్, స్వీకృత్ రెడ్డి, ప్రవీణ్ గౌడ్, గడ్డం మధుతేజ తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్రూం కాలనీల సమస్యలు పరిష్కరించాలని ధర్నా






**-కలెక్టర్, ఎమ్మెల్యేకు కాలనీవాసుల వినతి**

**వనపర్తి, ఫిబ్రవరి 24( నీలగిరి ఎక్స్ ప్రెస్):**

వనపర్తి జిల్లా కేంద్రంలోని డబుల్ బెడ్రూం కాలనీలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆయా కాలనీల ప్రజలు డిమాండ్ చేశారు. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని మర్రికుంట నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్రూం కాలనీ నాయకులు మండ్ల రాజు, గోపాలకృష్ణ, సాయిలీల, సుజాత, సింగోటి, వజ్రాల రమేష్, రఘుచారి, బి.రాము, తోట బాలరాజు లు మాట్లాడుతూ అప్పాయిపల్లి, పీర్లగుట్ట, రాజపేట, పెద్దగూడెం, చిట్యాల రోడ్డులో ఉన్న డబుల్ బెడ్రూం కాలనీలో మంచినీటి సమస్య, వీధి దీపాలు, సిసి రోడ్లు, సెప్టిక్ ట్యాంకులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు గుర్తు చేశారు. గత ప్రభుత్వం పేదలకు, రోడ్ల విస్తరణలో ఆస్తులు కోల్పోయిన వారికి డబుల్ బెడ్రూం బెడ్ ఇండ్లు కేటాయించింది కానీ వాటికి కనీస సౌకర్యాలు లేక ప్రజలు అనేక ఆవస్తులు పడుతున్నారని వివరించారు. పెద్దగూడెం గుట్ట ప్రాంతంలో డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించడం వల్ల వారి ఇండ్లలోకి వన్యప్రాణులు సంచరిస్తున్నాయని, ప్రజలు బిక్కుబిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారని చెప్పారు. పీర్లగుట్ట, పెద్దగూడెం డబుల్ బెడ్రూం కాలనీల్లో ప్రహరీ గోడ నిర్మించాలని, అప్పాయిపల్లి డబుల్ బెడ్రూం కాలనీ రోడ్డులో వీధిలైట్లు లేక రాత్రి సమయంలో ప్రజలు చీకట్లో ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వీధిలైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించిన వినియోగంలోకి తీసుకురావకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారన్నారు. రాజపేట, చిట్యాల రోడ్డులో ఉన్న డబుల్ బెడ్రూం కాలనీలో సెప్టిక్ ట్యాంకులు లేక ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని, వెంటనే సెప్టిక్ ట్యాంకులు ఏర్పాటు చేయాలని కోరారు. చిట్యాల రోడ్డులో ఉన్న డబుల్ బెడ్రూం కాలనీలో వీధిలైట్లు, సిసి రోడ్లు, మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, సమస్య పరిష్కారానికి తక్షణమే నాలుగు బోర్లు వేయాలని వారి కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డిని కాలనీవాసులు కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. స్పందించిన కలెక్టర్, ఎమ్మెల్యే త్వరలో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జమీర్, నిరంజన్, సురేంద్రబాబు, గన్నోజు రవి కుమారాచారి, వినోద్, చందు, సిద్దయ్య, నరేందర్, గొర్ల రమేష్, భూదేవి, రాములమ్మ, తిరుపతయ్య, పెద్ద కాజా, మైను, నూర్ సమద్, నంబి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

# శివ స్వాముల ఇరుముడి మహోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి

**వంగూర్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

వంగూరు మండల పరిధిలోని డిండి చింతపల్లి గ్రామంలో శివ స్వాముల ఇరుముడి మహోత్సవం ఘనంగా నిర్వహించారు.

ఈ మహోత్సవంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీయన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యాల్ రెడ్డి మరియు విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. గ్రామ ప్రజలు మరియు ఇతర ప్రముఖులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని శివ స్వాములకు ప్రత్యేక పూజలు అందించారు.



## మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు పంపిణీకి 25 వేల వాటర్ ప్యాకెట్లు సిద్ధం: జాలెర బ్రదర్స్



**నల్లగొండ, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నల్లగొండ జిల్లా చందంపేట మండలం ఏలేశ్వరం గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా శివాలయానికి వచ్చే భక్తులకు అండాలమ్మ వెంకటరెడ్డి ట్రస్టు ద్వారా 25వేల వాటర్ ప్యాకెట్లను ట్రస్ట్ అధ్యక్షులు జాలే నరసింహారెడ్డి మరియు తిలక్ రెడ్డి పంపిణీకి సిద్ధం చేశారు. దూర ప్రాంతం నుంచి వచ్చే భక్తులకు ముందస్తు చర్యల్లో భాగంగా, ఆలయ కమిటీ సభ్యులు జాలే నరసింహారెడ్డి మరియు తిలక్ రెడ్డి ప్రతి సంవత్సరం ఏలేశ్వరం భక్తులకు సహాయం చేస్తూ ఉంటారని తెలిపారు. ఈ సంవత్సరంలో వేసవికాలం దృష్ట్యా పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉందని, వారికి సహాయం చేయడానికి 25వేల వాటర్ ప్యాకెట్లను అందజేయడం జరుగుతుంది అని, వారి కుటుంబ సభ్యులకు ఆలయ చైర్మన్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాములు, మద్దిమడుగు కృష్ణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## జీ-20 సదస్సుకు నిస్వార్థ ఆర్గనైజేషన్నుంచి గణేష్ ఎంపిక




**వనపర్తి ఫిబ్రవరి 24( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఢిల్లీ వేదికగా జరుగనున్న జీ–20 సదస్సుకు నిస్వార్థ ఆర్గనైజేషన్ వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు కట్రావత్ గణేశ్ ఎంపికయ్యారు. గణేష్ పూర్వం నుంచి పర్యావరణంపై మక్కువతో నిస్వార్థ ఆర్గనైజేషన్, ఎన్ఎస్ఎస్ ఇతర సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్న రీత్యా, ఫిబ్రవరి 21న హైదరాబాదులో జరిగిన జీ–20 సదస్సు వాలంటీర్ల ఎంపికల్లో సెలెక్ట్ అయ్యారు.పర్యావరణ పరిరక్షణపై వారు ఇచ్చే ప్రాజెక్టును అధ్యయనం చేసి ఢిల్లీ వేదికగా సమర్పించనున్నారని వారు తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

**-జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి,ఫిబ్రవరి 24( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, అర్జీలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.
సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం తో కలిసి హాజరై ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 66 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను పరిశీలించి, సత్వర పరిష్కారం చూపేలా సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చిన, పెండింగ్ లో ఉన్న అర్జీలను సైతం వారంలో పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు

## జీవశాస్త్రంలో ప్రతిభ కనబర్చిన నిహారికకు రాష్ట్రస్థాయి సెకండ్ ర్యాంకు



**వంగూర్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వంగూర్ మండల పరిధిలోని డిండి చింతపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని నిహారిక రాష్ట్రస్థాయిలో జీవశాస్త్రంలో సెకండ్ ర్యాంకు సాధించింది. సోమవారం హైదరాబాద్‌లో గురుకులాల డైరెక్టర్ రమణకుమార్ చేతుల మీదుగా నిహారిక అవార్డు అందుకుంది. నిహారిక రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనపరచడం పట్ల ఉపాధ్యాయులు శివానంద చారి, విద్యార్థిని తల్లిదండ్రులు పర్వతాలు శాంతమ్మ హర్షం వ్యక్తం చేశారు.

## పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.
మమ్మల్ని సంప్రదించడానికి:
ఇమెయిల్: neelagiriexpress@gmail.com
సంప్రదింపు నెంబర్: 9705770909
మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.
మీ గొంతుకకు మేమే వేదిక – నీలగిరి ఎక్స్‌ప్రెస్!

# ప్రజావాణిలో 70 ఫిర్యాదులు - వెంటనే పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాలు






**రంగారెడ్డి, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు అందజేసిన అర్జీలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీతలతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అన్నారు. ఈసారి ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 36, ఇతర శాఖలకు 34, మొత్తం 70



దరఖాస్తులు అందాయి.
అనంతరం జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే ఇంటర్మీడియట్ మరియు పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో 100% ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని విద్యాశాఖ అధికారుల్ని సూచించారు. పదవ తరగతిలో సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ఆయా సబ్జెక్టుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాల/కళాశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. రానున్న వేసవిలో జిల్లాలో ఎక్కడా నీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని, మరమ్మత్తులు ఏమైనా ఉంటే వెంటనే చేపట్టి నీటి ఎద్దడిని నివారించాలని చెప్పారు. గ్రామ పంచాయతీ పరిధిలో, మండల మున్సిపల్ పరిధిలో మరమ్మత్తులు ఉంటే, చేయించి నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. గ్రాల మున్సిపల్ పరిధిలో అధికారులు సమన్వయంతో పనిచేసి రాబోయే వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళిక బద్ధంగా పని చేయాలని అన్నారు. నీరు వృధా కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## ఎస్ఎల్బిసి టన్నెల్‌లో చిక్కుకున్న 8 మంది కార్మికులు

**- బీఎస్పీ నేతల సందర్శన**



**అమ్రాబాద్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమ్రాబాద్ మండలంలోని ఎస్ఎల్బిసి టన్నెల్‌లో చిక్కుకున్న 8 మంది కార్మికులు గత రెండు రోజులుగా ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలను విచారించేందుకు బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న, జిల్లా ఇన్‌చార్జ్ బీస మొళ్ళ యెసేఫ్, అచ్చంపేట అసెంబ్లీ ఇన్‌చార్జి కృపానందం తదితరులు SLBC టన్నెల్‌ను సందర్శించారు. కార్మికుల క్షేమం కోసం, కార్మిక సంఘాల నేతలు, టన్నెల్‌లో పరిస్థితులను సమీక్షించి తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కోరారు.

## మహాశివరాత్రి పురస్కరించుకొని గుండాల గ్రామంలో మహా అన్నదాన కార్యక్రమం



**వెల్దండ, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెల్దండ మండల పరిధిలోని గుండాల గ్రామంలోని అంబ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం వద్ద మహాశివరాత్రి పురస్కరించుకొని 15 రోజులపాటు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడానికి ఏర్పాట్లు చేపట్టారు. అన్నదాతలు జక్కుల చిన్న జంగయ్య యాదవ్ మరియు మహేష్ యాదవ్ ఈ ఏర్పాట్లను పరిశీలించారు. వారితో పాటు సింహారెడ్డి, ఆలయ పూజారులు, ఆలయ కమిటీ వైస్ చైర్మన్ అరుణ్, శీను, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెంజర్లలో శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయాన్ని సందర్శించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, చల్లా వంశీచంద్

**షాద్‌నగర్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు మండల పరిధి పెంజర్ల గ్రామం ఆధ్యాత్మికంగా అభివృద్ధి సాధించిందని, ఇది శుభ పరిణామమని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. కేరళ అనంతరం వికారాబాద్ తర్వాత పెంజర్ల గ్రామంలోని అనంతపద్మనాభ స్వామి ఆలయం ప్రముఖ పుణ్యక్షేత్రంగా నిలిచిందని చెప్పారు. సోమవారం నాడు రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం పెంజర్ల గ్రామ శివారులో పునర్నిర్మించిన 800 ఏళ్ల నాటి స్వయంభు శ్రీ అనంతపద్మనాభ స్వామి దేవాలయ ప్రారంభోత్సవ ఆధ్యాత్మిక వేడుకల్లో స్పీకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే వీరపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏఐసీసీ జాతీయ కార్యదర్శి చల్లా వంశీచందర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తదితర స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరయ్యారు.



ఈ సందర్భంగా ఆలయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యేలు వీరపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్‌లకు ఆలయ నిర్వాహకులు మాజీ జెడ్పిటిసి మామిడి శ్యాంసుందర్ రెడ్డి మరియు ఆలయ చైర్మన్ బెజవాడ అనితా రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అర్చకులు పూర్ణకుంభంతో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ, కేరళలోని అనంతపద్మనాభ స్వామి ఆలయం తర్వాత వికారాబాద్‌లో ఉన్న పుణ్యక్షేత్రం మరియు ఇప్పుడిక్కడ 800 ఏళ్ల నాటి స్వయంభు అనంతపద్మనాభ స్వామి ఆలయం ఎంతో విశిష్టమైనదని తెలిపారు. ఈ ప్రాంతం భవిష్యత్తులో ఆధ్యాత్మిక పర్యటన కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి మరియు బెజవాడ అనితా రెడ్డి ఆలయాన్ని అభివృద్ధి చేయడం అభినందనీయమని, పెంజర్ల ఆలయానికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రభుత్వం ద్వారా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, వికారాబాద్‌లోని శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయానికి ప్రతిరోజు 30 వేల మందికి పైగా భక్తులు దర్శనం చేసుకుంటారని, భవిష్యత్తులో పెంజర్ల ఆలయానికి కూడా అంత భక్తుల తాకిడి ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చల్లగా ఉండాలని, రాష్ట్ర ప్రగతిని ముందుకు నడిపించేందుకు స్వామి చల్లగా ఉండాలని కోరుకున్నారు. అంతేగాక, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు.

# గంగపురం గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న టాస్క్ సీవోవో సుంకిరెడ్డి

**ఆలేరు, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఆలేరు నియోజకవర్గంలోని గుండాల మండలం గంగపురం గ్రామంలో, మాదాడి బ్రదర్స్ వంశీ రెడ్డి, భరత్ రెడ్డి, మరియు అరుణ్ రెడ్డి సహకారంతో శంకర నేత్రాలయ చెన్నై ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిర సేవలు ఈరోజుతో విజయవంతంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ మరియు టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరయ్యారు.



కంటి వైద్య శిబిర నిర్వాహకులు మాట్లాడుతూ, గత పది రోజులుగా కొనసాగుతున్న ఉచిత వైద్య శిబిరానికి దాదాపు 3,000 మంది హాజరై, 1500 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 1000 మందికి ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశారని తెలిపారు. దాదాపు 115 మంది కంటి శుక్లాల సర్జరీకి ఎంపిక అవగా, అందరికీ విజయవంతంగా సర్జరీలు పూర్తయ్యాయని పేర్కొన్నారు. 78 మంది ఇతర కంటి సమస్యలు ఉన్న పేషెంట్లను చెన్నై బేస్ హాస్పిటల్‌కు రిఫర్ చేశామని తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ, మారుమూల నిరుపేదలను దృష్టిలో ఉంచుకొని ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, గత పది రోజులుగా సేవలు అందిస్తున్న మాదాడి బ్రదర్స్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని, నిరుపేద ప్రజలకు నిస్వార్థమైన సేవ చేస్తున్నందుకు మాదాడి సోదరులకు ప్రజల ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య శిబిరం నిర్వాహకులు మాదాడి వంశీ రెడ్డి, శంకర నేత్రకాయ వైద్య బృందం సభ్యులు రాజు, గ్రామ మాజీ సర్పంచ్ సైదయ్యతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# చంద్రబాబు పై కేసిఆర్ వ్యాఖ్యలకు తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్ కౌంటర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

తెలంగాణ భవన్‌లో ఇటీవల జరిగిన బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో బీఆర్ఎస్ అధ్యక్షులు కె. చంద్రశేఖర్‌రావు చేసిన వ్యాఖ్యలను తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండించింది. తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, "మళ్లీ సెంటిమెంట్‌ను ప్రజలలో రెచ్చగొట్టి అధికారంలోకి రావాలని కేసీఆర్ ప్రయత్నిస్తున్నారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారు" అని అన్నారు. ఎన్‌టి రామారావు తెలుగుదేశం పార్టీని హైదరాబాద్‌లోనే ప్రారంభించారని, అప్పటి వరకు రాజకీయాల్లో అవకాశాలు లేని బడుగు బలహీనవర్గాలకు వేదికగా తెలుగుదేశం పార్టీని రూపొందించారని గుర్తు చేశారు. చదువుకున్న బలహీనవర్గాల యువతకు ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా అవకాశాలు కల్పించి గెలిపించి నాయకులుగా తయారు చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని తెలిపారు. సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంలో ఇతర పార్టీలకు ఆదర్శంగా నిలిచిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని, అలాగే



తెలంగాణ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో తెలుగుదేశం పార్టీ పాత్రను ఎవరూ కాదనలేని నిజం అని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం ఈ రోజు తెలంగాణ రాష్ట్ర ఆదాయంలో దాదాపు 60 శాతం ఆదాయం తెచ్చిపెడుతున్నదంటే దానికి ప్రధానకారణం తెలుగుదేశం ప్రభుత్వం, చంద్రబాబు గారు వేసిన బలమైన పునాదులే అని అన్నారు. పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేసి తెలంగాణ ప్రజలకు నిజమైన స్వాతంత్ర్యాన్ని తీసుకొచ్చిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని తెలిపారు.

సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి 2018 అసెంబ్లీ ఎన్నికలలో రెండోసారి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ మళ్లీ అదే తంత్రాన్ని ఇప్పుడు ప్రయోగించాలని చూస్తున్నారని, సెంటిమెంట్‌తో 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న కేసీఆర్, కేసీఆర్ కుటుంబం తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వనరులను దోచుకున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు లేఖ ఇచ్చింది తెలుగుదేశం పార్టీ అని కేసీఆర్‌కు గుర్తు చేస్తూ, పదేపదే మా జాతీయ పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పై అసందర్భంగా విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

# నాగర్ కర్నూల్‌లో వృద్ధుడి ఆత్మహత్యా యత్నం

**– ఆసుపత్రికి తరలింపు**

**నాగర్ కర్నూల్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఓ వృద్ధుడు గొంతుకు కత్తి పెట్టుకుని ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పెద్ద మల్లయ్య (90) అనే వృద్ధుడు, వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం చినకుంటపల్లి గ్రామానికి చెందినవాడు.



కొంతకాలంగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎర్రగడ్డ కాలనీలో తన కొడుకు వద్ద నివసిస్తున్నారు. అయితే, మతిస్థిమితం కోల్పోయిన కారణంగా ఆయన గొంతులో కత్తితో దెబ్బ తీసుకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ ఘటనను గమనించిన వారు తక్షణమే హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో ఇంకా స్పష్టత రాలేదు. పోలీసులు ఘటనపై విచారణ చేపట్టి, పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

# చెట్టు = అమ్మ
# చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**

-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.

-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.

-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**

-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.

-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.

చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"


మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# కర్కల్ పహాడ్ గ్రామంలో ఎక్స్‌ప్రెస్ బస్టాప్ ఏర్పాటుకు చర్యలు

**కడ్తాల, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కడ్తాల మండల పరిధిలోని కర్కల్ పహాడ్ గ్రామంలో ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపడం లేదని, ఎక్స్‌ప్రెస్ స్టాప్ ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు సి డబ్ల్యూ సి సభ్యులు, ఏఐసీసీ కార్యదర్శి చల్ల వంశీ చందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కడ్తాల మండల పర్యటన సందర్భంగా, వంశీ చందర్ రెడ్డి వెంటనే స్పందించి, మహబూబ్నగర్ ఆర్టీసీ ఆర్ ఎం కు ఫోన్ చేసి కర్కల్ పహాడ్ దగ్గర ఎక్స్‌ప్రెస్ బస్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు. మహబూబ్నగర్ ఆర్టీసీ ఆర్ ఎం సానుకూలంగా స్పందించి, బస్టాప్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కర్కల్ పహాడ్ గ్రామ ప్రజలు వంశీ చందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# భూత్పూర్‌లో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుకు అగ్నిప్రమాదం



**భూత్పూర్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

భూత్పూర్ మండల పరిధిలోని షేర్ పల్లి వద్ద సోమవారం ఉదయం బెంగళూరు నుండి హైదరాబాద్ వెళ్తున్న సలీం ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక భాగంలో మంటలు చెలరేగి నిప్పు అంటుకుంది. ప్రయాణికులు వెంటనే బస్సులో నుంచి కిందకి దిగడంతో ప్రాణాలతో బయటపడ్డారు. ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశారు. బస్సు 70 శాతం దగ్ధమైంది. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఈ సంఘటన జరిగిందని ప్రయాణికులు ఆరోపించారు. ప్రయాణికులకు ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఇంకా పూర్తి వివరాలు తెలియ రావలసి ఉంది.


# రాష్ట్రంలో ఆమ్జెన్ రూ.1600 కోట్లు పెట్టుబడులు

న్యూ టెక్నాలజీ, ఇన్నోవేషన్ సైట్ ప్రారంభం
బయో ఫార్మా రంగంలో భారీగా పెట్టుబడులు




హైదరాబాద్,(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
అమెరికాలోనే అతి పెద్ద బయో టెక్నాలజీ కంపెనీ ఆమ్జెన్ హైదరాబాద్ లో తమ న్యూ టెక్నాలజీ, ఇన్నోవేషన్ సైట్ ను సోమవారం ప్రారంభించింది. హైటెక్ సిటీ సమీపంలో ని అమ్జెన్ ఆఫీసు ప్రాంగణంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్ బాబు అమ్జెన్ ఇన్నోవేషన్ సైట్ ను ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో అమ్జెన్ చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాబర్ట్ ఎ. బ్రాడ్‌వే, అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్, అమ్జెన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ గుల్లపల్లి, అమ్జెన్ ఇండియా ప్రతినిధి సోమ్ చటోపాధ్యాయ, తదితరులు పాల్గొన్నారు. 2025 నాటికి కంపెనీ విస్తరణలో భాగంగా $200 మిలియన్లు (దాదాపు రూ. 1600 కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. భవిష్యత్తులో తెలంగాణలో ఆమ్జెన్ మరిన్ని పెట్టుబడులకు ప్లాన్ చేస్తోంది. అమెరికాలో అతిపెద్ద కంపెనీ అయిన ఆమ్జెన్ బయో ఫార్మా రంగంలో యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి శ్రీకారం చుట్టింది. అమ్జెన్ తమ మెడిసిన్ శ్రేణిని మరింత అభివృద్ధి చేసేందుకు తెలంగాణలో తమ కార్యకలాపాలను విస్తరిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఏఐ, డేటా సైన్స్ తో డిజిటల్ సామర్థ్యాలను ఈ కొత్త సైట్ అందిస్తుందని పేర్కొన్నారు.

# బీహార్‌లో ఘోర రోడ్డు ప్రమాదం




పాట్నా, (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
బీహార్‌లో ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పాట్నాలోని మసౌర్హిలోని నూరా వంతెనపై ట్రక్కు, టెంపో వాహనాలు రెండు ఢకొన్నాయి. ఈ ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై మసౌర్హి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ (ఎస్‌డిపిఓ) సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. 'ఆదివారం రాత్రి నూరా బ్రిడ్జిపై జరిగిన ఈ ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించాము. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదంలో టెంపో, ట్రక్కు రెండు వాహనాలు వంతెనపై నుండి పడిపోయాయి. వెంటనే స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచార మిచ్చారు. దీంతో హుటాహుటిన ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు' అని ఆయన అన్నారు.

# మహిళలకు ఆర్థికసాయంపై మాటతప్పిన బిజెపి

-సిఎం రేఖాగుప్తా ఆఫీసు ముందు అతిషి ధర్నా

న్యూఢిల్లీ, (నీలగిరి ఎక్స్‌ప్రెస్)



మహిళలకు ప్రతినెలా రూ. 2,500 ఆర్థిక సాయంపై బీజేపీ ప్రభుత్వం మొదట్లోనే మాటతప్పిందంటూ ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, విపక్షనేత అతిషి ఆరోపించారు. ఆప్ ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి రేఖాగుప్తా కార్యాలయం ఎదుట సోమవారంనాడు నిరసనకు దిగారు. రెండ్రోజులుగా సమయం ఇవ్వాలని సీఎంని అడిగాం. ఇవ్వలేదు. ఈరోజు అసెంబ్లీ సమావేశాల సమయంలో సీఎంను కలుస్తాం. మోదీ ఇచ్చిన హామీని క్యాబినెట్ తొలిసమావేశాల్లోనే అమలు చేయాలని సీఎంను కోరాం. వాళ్లు వాగ్దాన భంగం చేశారు. మార్చి 8వ తేదీ నుంచి మహిళా సమ్మాన్ యోజన కింద రూ. 2,500 తప్పనిసరిగా ఢిల్లీ మహిళలకు చేరాలని ఆశిస్తున్నాం అని అతిషి చెప్పారు. ఖాళీ ఖజానాను తమకు అప్పగించారంటూ సీఎం రేఖా గుప్తా చెప్పడంపై అతిషి మాట్లాడుతూ, పదేళ్ల తర్వాత ఆర్థికంగా బలంగా ఉన్న ప్రభుత్వాన్ని బీజేపీకి తాము అప్పగించామన్నారు. సాకుల కోసం వెతుక్కోకుండా ఇచ్చిన వాగ్దానాలను బీజేపీ నిలబెట్టుకోవాలని సూచించారు. 2015లో ఆప్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు ఢిల్లీ మొత్తం బడ్జెట్ రూ. 30,000 కోట్లు మాత్రమేనని, గత పదేళ్లలో బడ్జెట్ రూ. 70,000 కోట్లకు పెరిగిందని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలు, హామీలను ఏదోసాకుతో ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తారని బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి తాను అనుకుంటూనే ఉన్నానని అన్నారు. కాగా, దీనికి ముందు రేఖాగుప్తా మీడియాతో మాట్లాడుతూ, ఆప్ ప్రభుత్వం వెళ్తూ వెళ్తూ ఖజానాను ఖాళీ చేసి వెళ్లిందని, దీనిపై అధికారులతో సమీక్ష జరిపామని చెప్పారు.

# వంటనూనెల వినియోగం తగ్గించండి

-ఊబకాయంపై ప్రధాని మోడీ ఆందోళన
-ప్రజల్లో అవగాహన కోసం పదిమంది నామినేట్



న్యూఢిల్లీ (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
దేశంలో ఊబకాయ సమస్య పెరిగిపోతుందని.. దీనిపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ప్రధాని మోడీ అన్నారు. ఈ సమస్యను అధిగమించాలంటే.. వంట నూనెల వినియోగాన్ని తగ్గించాలని ఆయన సూచించారు. ఈ సమస్యపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి పది మంది ప్రముఖులను నామినేట్ చేశారు. వారిలో ప్రముఖ మలయాళ నటుడు మోహన్‌లాల్, గాయకురాలు శ్రేయోఘోషల్ కూడా ఉన్నారు. ఆదివారం జరిగిన మన్‌కీబాత్ 119వ ఎపిసోడ్ కార్యక్రమంలో మోడీ ఊబకాయ సమస్య గురించి ప్రస్తావించారు. 'గత కొన్నేళ్లుగా దేశంలో ఊబకాయ సమస్య పెరిగిపోతుంది. ముఖ్యంగా చిన్నారుల్లో ఈ సమస్య పెరిగిపోతోంది. ఈ సమస్యను అధిగమించాలంటే తినే ఆహారంలో చిన్న చిన్న మార్పులు చేసుకోవాలని ఆయన సూచించారు. గత కొన్నేళ్లుగా ఊబకాయం కేసులు రెట్టింపయ్యాయి. ఈ గణాంకాలు ఆందోళన కలిగిస్తోంది. ప్రతి ఎనిమిది మందిలో ఒక్కరైనా ఊబకాయ సమస్యతో బాధపడుతున్నారు. ఈ సమస్యను అధిగమించాలంటే ప్రతినెలా పదిశాతం వంట నూనె వినియోగాన్ని తగ్గించాలి. ఈ చిన్న మార్పు ప్రజారోగ్యంపై పెద్ద ప్రభావం చూపుతుంది. మీ ఆహారపు అలవాట్లు మిమ్మల్ని ఫిట్‌గా ఉంచుతాయి. ఈ సమస్యపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు.. ఆరోగ్యవంతమైన దేశాన్ని నిర్మించేందుకు క్యాంపెయిన్ నిర్వహించాలి' అని ఆయన అన్నారు. కాగా, ఈ క్యాంపెయిన్‌కు ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా, జమ్ము కాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా, యువ షూటర్ మను బాకర్, వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను, ప్రముఖ నటులు దినేశ్‌లాల్ యాదవ్, ప్రముఖ మలయాళ నటుడు మోహన్‌లాల్, మాధవన్, గాయకురాలు శ్రేయా ఘోషల్, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, రాజ్యసభ ఎంపి సుధామూర్తి అను ప్రధాని మోడీ నామినేట్ చేశారు. ఈ మేరకు వీరి పేర్లను మోడీ ఎక్స్ పోస్టులో వెల్లడించారు.

# మూసీ సుందరీకరణ అడ్డుకుంటున్న కిషన్ రెడ్డి

-హైదరాబాద్ మెట్రో విస్తరణకు అడ్డుపుల్ల
-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
-నిజామబాద్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న సిఎం
-బిఆర్ఎస్, బీజేపీలపై తీవ్ర ఆగ్రహం




హైదరాబాద్, (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. ఒకరు కేటీఆర్ అరెస్ట్‌ను అడ్డుకుంటుంటే, మరొకరు హైదరాబాద్ మెట్రో విస్తరణ, మూసీ సుందరీకరణ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. నిజామబాద్‌లో శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న రేవంత్ రెడ్డి మాట్లడుతూ బిఆర్ఎస్, బీజేపీపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ విషయంలో కేంద్రం సహకరించకుండా తెలంగాణకు చెందిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు రేవంత్. మెట్రో విస్తరణకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వేగంగా కార్యచరణ మొదలుపెట్టింది. నిధులు కొరత ఉన్నప్పటికీ సొంత నిధులతోనైనా ముందుకు సాగేందుకు విశ్వప్రయత్నాలు చేసింది. అయితే భూసేకరణతోపాటు మెట్రో విస్తరణకు అవసరమైన వేలకోట్ల రూపాయలు నిధులు రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా మారాయి. అందులోనూ ఉచిత బస్సు, రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మెట్రోను విస్తరించడం భారంగా మారింది. ఈ నేపథ్యంలో కేంద్రంపై ఆధారపడక తప్పలేదు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి . కిషన్ రెడ్డిపై చేసినవి ఆరోపణలు కాదని, తనకు బీజేపీ మంత్రులతో పరిచాయాలున్నాయని, వాళ్లే చెప్పారని రేవంత్ అనడం మాట్లడటం రాజకీయ దుమారం రేపుతోంది. నిధులు విడుదల చేసి, మెట్రో విస్తరణకు సహకరిస్తే, రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పేరు వస్తుందే కానీ, బీజేపీకి రాదు అని కిషన్ రెడ్డి చెప్పారని రేవంత్ రెడ్డి అన్నారు. మెట్రో ముందుకు వెళ్లకుండా ఆపుతున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ అభివృద్ధి చెందడం కిషన్ రెడ్డికి ఇష్టం లేదంటూనే తీవ్ర స్థాయిలో విమర్శించారు. మూసీ ప్రక్షాళన, సుందరీకరణ ప్రాజెక్టు విషయంలో కేంద్రం నుంచి ఏమాత్రం సహకారం రాకపోవడానికి ప్రధాన కారణం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డేనని ఆరోపించారు రేవంత్. యూపిలో గంగా, గుజరాత్‌లో సబర్మతి, ఢిల్లో యమున ఇలా అనేక నదులు ప్రక్షాళన చేసిన కేంద్రానికి అదే హైదరాబాద్‌లో మూసి ప్రక్షాళన ఎందుకు కనిపించడలేదన్నారు. మూసీ సుందరీకరణకు కేంద్రం నుంచి నిధులు రాకుండా, పర్యావరణ అనుమతులు ఇవ్వకుండా కావాలనే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పాలమూరు ఎత్తిపోతల పథకంతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు కేంద్రం సహకారం లేకుండా నిలిచిపోతున్నాయంటే దానికి ప్రధాన కారణం కిషన్ రెడ్డి మాత్రమేనని రేవంత్ ఆరోపించారు. సిఎం హోదాలో ఉండి ఓ కేంద్రమంత్రిపై అందులోనూ ఇదే రాష్ట్రానికి చెందిన సీనియర్ బిజెపి నేతపై చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపుతున్నాయి. హైదరాబాద్‌లో మూసీ పరివాహక ప్రాంత ఓటర్ల ఓట్లతో గెలిచిన కిషన్ రెడ్డి అదే మూసీ అభివృద్ధిని ఎందుకు ఓర్వలేకపోతున్నారని నిప్పులు చెరిగారు రేవంత్. కేవలం ఆరోపణలు చేయడమే కాదు, అదే పార్టీకి చెందిన మంత్రులు చెప్పారని అనడం మరింత అగ్గి రాజేసింది.

# శ్రీలంక అదుపులో 700పైగా బోట్లు


-రామేశ్వరంలో మత్స్యకారుల ఆందోళన

చెన్నై,(నీలగిరి ఎక్స్‌ప్రెస్)




తమిళనాడులోని రామేశ్వరంలో మత్స్యకారులు సోమవారం నుండి నిరవధిక సమ్మెకు దిగారు. శ్రీలంక నేవీ నిర్బంధంలో ఉన్న మత్స్యకారులను, పడవలను వంటనే విడుదల చేయాలని మత్స్యకారుల సంఘం డిమాండ్ చేస్తోంది. 700కిపైగా బోట్‌లను హార్బర్‌లో నిలిపివేయడంతో రామేశ్వరంలోని ఫిషింగ్ హార్బర్ నిర్మానుష్యంగా మారింది. శ్రీలంక నేవీ నిర్బంధించిన బందీలను వెంటనే విడిపించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సమావేశంలో తీర్మానం చేసినట్లు రామేశ్వరం మత్స్యకారుల సంఘం కార్యదర్శి సగాయం పేర్కొన్నారు. మత్స్యకారుల బోట్లను వేలం వేయకుండా చూడాలని కోరారు. త శనివారం రామేశ్వరం నుండి 440 బోట్లలో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లారు. పాల్క్‌బే సముద్ర ప్రాంతంలో చేపల వేట సాగిస్తుండగా, శ్రీలంక నేవీ అధికారులు పెట్రోలింగ్ బోట్‌లో అక్కడికి చేరుకున్నారు. అంతర్జాతీయ సముద్ర సరిహద్దును దాటారంటూ 5 పడవలను, 32 మంది మత్స్యకారులను అదుపులోకి తీసుకున్నారు. భారతీయ మత్స్యకారులను శ్రీలంకనేవీ అదుపులోకి తీసుకుంటున్న ఘటనలు పెరగడంపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారం కోసం సంయుక్త కార్యవర్గాన్ని (జెడబ్ల్యుజి) సమావేశపరచాలని విదేశాంగమంత్రి జై శంకరకు రాసిన లేఖలో పేర్కొన్నారు. గత జనవరి నుండి 131 మంది తమిళనాడు మత్స్యకారులను శ్రీలంక నేవీ అదుపులోకి తీసుకుంది. 18 బోట్లను స్వాధీనం చేసుకుంది.

# ఫ్యాబ్రికేషన్ కార్మికునికి రావలసిన వేతనం ఇప్పించిన బిఆర్ టీయు రాష్ట్ర కార్మిక నాయకుడు రవిసింగ్



కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సూరారం ఇండస్ట్రీ ఏరియాలో "భాష ఖాన్ ఫ్యాబ్రికేషన్" లో పనిచేసే కార్మికుడు ప్రవీణ్ తన రావలసిన వేతనం అందుకోలేక ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో, బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు మరియు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ ద్వారా న్యాయం పొందారు. ప్రవీణ్ ఫ్యాబ్రికేషన్ షాప్‌లో గత కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నప్పటికీ, కొన్ని అనివార్య కారణాల వలన ఓనర్ భాష ఖాన్ వేతనం 25,000 రూపాయలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతూ ఉండటంతో, ప్రవీణ్ వర్క్ మానేయాల్సి వచ్చింది. పలుమార్లు వేతనం అడిగినా, నిర్లక్ష్యం వహించడంతో విసుగు చెందిన ప్రవీణ్, బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు రవిసింగ్‌ను సంప్రదించారు. రవిసింగ్ హుటాహుటిన ఫ్యాబ్రికేషన్ షాప్‌కి వెళ్లి, భాష ఖాన్‌తో చర్చించి, ప్రవీణ్‌కు రావలసిన వేతనం 25,000 రూపాయలు ఇప్పించారు. ప్రవీణ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, తనకు న్యాయం చేసిన రవిసింగ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.